

20న జాబ్ మేళా

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్తంగా కలిసి నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ కోఆర్డిరేటర్ గుణశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జాబ్ మేళాలో మంత్రి ఆర్‌కె.రోజా పాల్గొంటారన్నారు. పుత్తూరులో ఈనెల 20న నిర్వహించే సాబ్‌మేళాలో నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదవ తరగతి, ఇంటర్, ఐ.టి.ఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, నర్సింగ్/డిగ్రీ, బి.టెక్, పి.జి, చదివిన వారు పాల్గొనాలన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులకు అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు 6300954441, 6304330520 నెంబర్లుకు సంప్రదించాలన్నారు.

సర్కార్‌పై పోరుకేక..
సమ్మె ఆగదు దిగొచ్చేదాక..!

- కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె
- చిత్తూరులో మానవహారం..
- పులిచెర్లలో ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన
- కార్వేటినగరం కుమారగిరిపై వినూత్నంగా ఆందోళన


కార్వేటినగరం కుమారగిరిపై ఆందోళన


చిత్తూరు వివేకానంద విగ్రహం ఎదుట అంగన్‌వాడీల మానవహారం

ప్రభుత్వం దిగిరాకుంటే సమ్మె ఉధృతం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: అంగన్వాడి వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం గత 12వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేపట్టడం విధితమే. 6వ రోజు శనివారం ఉదయం కట్టమంచి చెరువు స్వామి వివేకానంద విగ్రహం వద్ద అంగన్వాడి కార్యకర్తలు మానవహారం నిర్వహించారు. అంగన్వాడీ యూనియన్ నేతలు సృజని, ప్రేమ మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు తన పాదయాత్రలో అధికారంలోకి వస్తే అంగన్వాడీ కార్యకర్తలకు న్యాయమైన సమస్యలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో అంగన్వాడీ కార్యకర్తలకు ఇస్తున్న వేతనం కన్నా రూ.వెయ్యి ఎక్కువగా ఇస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు పూర్తి కావస్తున్న ఎన్నికలు సమీపించే రోజులు దగ్గర పడుతున్న ఇప్పటికీ కార్మికులు సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం అయ్యారన్నారు. ఎన్నికలు వస్తున్నా సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజలను, రైతులను మోసం చేయడానికి ఎన్నికల జిమ్మిక్కులు చేస్తున్నారని విమర్శించారు.

జీతాలు పెంచే వరకూ సమ్మె విరమించబోం..
- యూనియన్ రాష్ట్ర కోశాధికారి వాణిశ్రీ

పులిచర్ల: న్యాయపరమైన అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె విరమించే ప్రసక్తే లేదని ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి వాణిశ్రీ స్పష్టం చేశారు. ఆదివారం 6వ రోజు సమ్మె సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో పులిచర్ల ప్రాజెక్టు వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి యూనియన్ రాష్ట్ర కోశాధికారి వాణిశ్రీ, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు, చిత్తూరు జిల్లా యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పదే పదే చర్చలు పేరుతో సమస్యలు పరిష్కారం చేయకుండా నానబెడుతున్నదని అనివార్య పరిస్థితిలో సమ్మెకు వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. సమ్మె సందర్భంగా సమస్యలను పరిష్కారం చేసే దిశగా ఆలోచించకుండా దౌర్జన్యానికి దిగుతూ సమ్మెలో ఉంటున్న వారిని బెదిరించడం సరైంది కాదన్నారు. గతంలో అనేక పోరాటాలు సందర్భంగా ప్రభుత్వాలు అరెస్టులు చేయడం కేసులు పెట్టడం లాంటి పద్ధతిలో అణచివేయడం ప్రయత్నం చేశారు తప్ప దౌర్జన్యం చేయలేదని నేటి ప్రభుత్వం భౌతికంగా దాడులకు దిగడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇలాగే మొండిగా వ్యవహరిస్తే పోరాటాన్ని ఉధృతం చేస్తామని దానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ముఖ్యమైన సమస్యలు వేతనాలు పెంచడం, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాటివిటీ అమలు చేయడం లాంటి వాటిని పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెను భగ్నం చేయాలని చూస్తే అది అంగన్వాడీల విషయంలో సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి సిఐటియు నాయకులు పాల్గొన్నారు.



పులిచర్ల ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

కుమారిగిరిపై హరోహర స్మరణతో నిరసన

కార్వేటినగరం: కార్వేటినగరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి కార్యకర్తలు స్థానిక కుమారగిరిపై శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద మోకాళ్లపై హరోహర స్మరణతో నిరసన తెలిపారు. కార్వేటినగరం, వెదురుకుప్పం, శ్రీ రంగరాజపురం మండలాలు సంబంధించిన అంగన్వాడి కార్యకర్తలు వినూత్నంగా నిరసన కార్యక్రమంతో ప్రభుత్వానికి తమ డిమాండ్‌లు తెలిపారు. "జగనన్న మనస్సు మార్చు.. మా సమస్యలు తీర్చు స్వామీ" అంటూ నినాదాలు చేశారు. సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి మమత, రాధమ్మలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి కక్ష సాధింపులు తమకు లేవని న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం దిగొచ్చి సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు.

ఇంటర్వ్యూ

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రాధాన్యత


శ్రీనివాస్, ఏడి

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులు, హిజ్రాల సంక్షేమ కోసం కృషి చేస్తున్నట్లు ఆశాఖ ఏడి శ్రీనివాస్ తెలిపారు. డిసెంబర్ 16 వతేది విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశామన్నారు. జిల్లాలో బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి త్వరలో భర్తీ చేయనున్నట్లు చెప్పారు. అలాగే హిజ్రాలకు వృత్తి విద్యలో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి కోసం ఋణాలు అందించామని జిల్లా కేంద్రంలోని విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతి గృహంలోని బాలికలకు మూడు పూటల నాణ్యమైన భోజనం, పాఠశాల, కళాశాలకు వెళ్లేందుకు ఆటో సౌకర్యం కల్పిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమశాఖ ఏడి శ్రీనివాస్ తెలిపారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో విభిన్న ప్రతిభావంతుల కోసం చేపడుతున్న కార్యక్రమాలను తెలియజేస్తూ..

ప్రజాశక్తి: విభిన్న ప్రతిభావంతుల కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు..?

ఏడి: ప్రభుత్వం కేవలం విభిన్న ప్రతిభావంతుల కోసం విభిన్న ప్రతిభావంతుల శాఖను ఏర్పాటు చేసింది. చిన్న, చిన్న లోపాలతో ఉన్న విభిన్న ప్రతిభావంతులు సమాజంలో ఇతరులతో సమానంగా ఎదిగేందుకు వారికి ప్రోత్సహం అందించాల్సిన అవసరం ఉంది. వీరి కోసం ప్రభుత్వం పెన్షన్ అమలు చేస్తోంది.

ప్రజాశక్తి: బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేస్తున్నారా..?

ఏడి: ప్రభుత్వ శాఖల్లో బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి అర్హత ఉన్న విభిన్న ప్రతిభావంతులచే భర్తీ చేయాల్సి ఉంటుంది. ప్రతి ఆరు నెలలకో సారి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడం జరుగుతుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హత ఉన్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం.

ప్రజాశక్తి: సదరం క్యాంపులు నిర్వహణ ఎప్పుడు..?

ఏడి: సదరం క్యాంపులు నిర్వహించడం వల్ల అంగవైకల్యం ఉన్న వారిని పరీక్షించి సర్టిఫికేట్లు ఇవ్వడం జరుగుతుంది. ప్రభుత్వం సచివాలయాల్లో అంగవైకల్యం కలిగిన వ్యక్తులు దరఖాస్తులు చేసుకొనేలా వెసులుబాటు కల్పించింది. జిల్లాలోని చిత్తూరు, పుంగనూరు, పలమనేరు, కుప్పం , నగరి ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నాం. సదరం క్యాంపుల నిర్వహన తేదీలు అక్కడికి ఎప్పుడు వెళ్లాలి అనే వివరాలను దరఖాస్తుదారులకు తెలియజేయడం జరుగుతోంది.

ప్రజాశక్తి: వివాహ్ ప్రోత్సహకాలు అందిస్తున్నారు..?

ఏడి: సకాలాంగులు వికలాంగులను వివాహం చేసుకుంటే ప్రభుత్వం నుండీ ఉపాధి కోసం ప్రోత్సహం అందించడం జరుగుతోంది. జిల్లాలో వివాహ్ ప్రోత్సహం పెండింగ్ లేదు.

ప్రజాశక్తి: ఉపకరాలను పంపిణీ చేస్తున్నారా..?

ఏడి: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, జూలై నెలలో దాదాపు రూ.1.5 కోట్ల విలువైన పరికరాలు అందించడం జరిగింది. 70 ద్విచక్ర వాహనాలు కూడా ఇవ్వడం జరిగిందని అన్నారు. విభిన్న ప్రతిభావంతుల ఎదుగుదలకు అంగవైకల్యం అడ్డుకాకూడదన్నది ప్రభుత్వ ధ్యేయం.

నేడు కలెక్టరేట్‌లో స్పందన రద్దు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యమ్రాన్నిఈ నెల 18న సోమవారం అనివార్య కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించి వ్యయ ప్రయాసలకు ఓర్చి జిల్లా కేంద్రానికి రావద్దని పేర్కొన్నారు.


ఎంపీడీవోను నిలదీస్తున్న సర్పంచ్ నాగరాజు


సర్వసభ్య సమావేశంలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

పంచాయతీ ఖాతా.. మండల మీట్‌లో కుర్చీలూ.. ఖాళీ

- తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం
- సమావేశానికి హాజరయ్యేందుకు ప్రజాప్రతినిధుల అనాసక్తత
- నిధులు లేక.. బిల్లులు రాక గ్రామాల్లో తిరగలేకున్నామని సర్పంచుల ఆవేదన

ప్రజాశక్తి-గుడుపల్లి: పంచాయతీ ఖాతాలో నిధులు లేవని.. చేసిన పనులకు బిల్లులు రాలేదని సర్వసభ్య సమావేశంలో గుండ్లసాగరం సర్పంచ్ నాగరాజు అధికారులను నిలదీశారు. గ్రామాల్లో కనీస అవసరాలు కల్పించేందుకు ప్రజలకు చెపకోలేక గ్రామాల్లో తిరగలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల స్త్రీ శక్తి భవనంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ వరలక్ష్మీ అధ్యక్షతన తూతూ మంత్రంగా జరిగింది. ఉదయం 10గంటలకు ప్రారంభం కావలసిన సమావేశం 11.50గంటల వరకూ కూడా మొదలు కాలేదు. 13మంది ఎంపీటీసీలు ఉండగా కేవలం 5 మందిని ఫోన్‌లో బ్రతిమలాడి పిలిపించుకొని 15నిమిషాల్లో సమావేశాన్ని పూర్తిచేసి మమ అనిపించుకున్నారు. మండలంలో 18మంది సర్పంచ్‌లు ఉండగా అందులో కేవలం ముగ్గురు మాత్రమే సమావేశానికి హాజరైయ్యారు. గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిధులు లేవని, చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయలేదంటూ సర్పంచ్ నాగరాజు, వెంకటేష్ ధ్వజమెత్తారు. అధికారులపై ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఎంపీడీవో తాజ్ మస్రూర్ ఈ సమావేశాన్ని అర్ధాంతరంగా సమావేశాన్ని ముగించారు.

జ్యుడీషియల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జ్యుడిషియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గోపినాధరెడ్డి

- జిల్లా అధ్యక్షులు గోపీనాథరెడ్డి

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరంలోని పాత కోర్టు ప్రాంగణంలో ఉమ్మడి జిల్లా జూలీషియల్ ఎంప్లాయిస్ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష గోపీనాథరెడ్డి, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీపతి మాట్లాడుతూ జూన్ నెలలో కొత్త కార్యవర్గం ఏర్పడిందన్నారు. జ్యుడీషియల్ పరిధిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా జడ్జ్, రాష్ట్ర యూనియన్ దష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు ఈ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా పలుచోట్ల కోర్టులో వర్క్ లోడ్ ఎక్కువగా ఉందని, పెండింగ్ కేసులు పరిష్కరించేందుకు తగిన సిబ్బంది లేకపోవడంతో వాటిని వర్తి చేయాలని కోరారు. కొత్తగా విధుల్లోకి చేరిన ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. జ్యుడీషియల్ ఉద్యోగులకు సంబంధించి మరిన్ని సమస్యల పైన కార్యవర్గ సమావేశంలో సభ్యుల అమూల్యమైన సలహాలు సూచనలు తీసుకొని వాటిని రిసల్యూషన్ ద్వారా పాస్ చేసి నివేదిక రూపంలో జిల్లా జడ్జికి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలలోని జ్యుడిషియల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

లారీ దూసుకొచ్చి..
ఇళ్లు ధ్వంసం



- గుండిశెట్టిపల్లి గ్రామంలో లారీ బీభత్సం
- తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-శాంతిపురం: మండల పరిధిలోని గుండిశెట్టిపల్లి గ్రామంలో ఆదివారం ఓ లారీ బీభత్సం సృష్టించింది. అతివేగంతో కుప్పం వైపు వస్తుండగా అదుపు తప్పి ఓ ఇంటిలోకి దుసుకొచ్చింది. సమయానికి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. స్థానికుల కథనం మేరకు.. గుండిశెట్టిపల్లి గ్రామ జాతీయ హైవే పక్కన సుమారు 50 అడుగుల దూరంలో బి.జయరాం నూతనంగా గృహ నిర్మించుకొని నివాసం ఉంటున్నాడు. కుప్పం వైపు ఇనుప వస్తువుల లోడుతో వస్తున్న ఈచర్ లారీ నడుపుతున్న డ్రైవర్ మితిమీరిన వేగంతో జాతీయ రహదారికి పక్కన ఉన్న ఇంట్లోకి దూసుకొచ్చింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేనందువల్ల ప్రాణాపాయం తప్పింది. ఇంటిలోని లోని విలువైన వస్తువులు గృహం చాలా వరకు ధ్వంసం అయింది. ఘటన స్థలానికి చేరుకున్న రాళ్ళబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

దారిపొడవునా కుదుపు.. వాహనానికి తప్పదు అదుపు.!

- అధ్వానంగా అంతరాష్ట్ర రహదారి
- చిత్తూరు-గుడియాత్తం రహదారిలో 9కిలో మీటర్ల మేరా ఇదే పరిస్థితి
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు
- నిద్రావస్థలో అధికారులు



ప్రజాశక్తి-యాదమరి: చిత్తూరు-గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి అధ్వానంగా తయారైంది. యాదమరి మండలం జోగుడిచింతల పోలీస్‌స్టేషన్ నుండి తమిళనాడు సరిహద్దు కనికాపురం చెక్ పోస్ట్ వరకు ఎక్కడ చూసినా గుంతలే కనిపిస్తున్నాయి. ఈ రహదారి గుండా ప్రయాణికులు ప్రయాణించాలంటే నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తారు రోడ్డు పూర్తిగా దెబ్బతిని మరమ్మతులు కరువవడంతో రహదారులు లోతైన గుంతలు ఏర్పడ్డాయి. పది రోజుల క్రితం రోడ్ల భవనాల శాఖ ఏఈ ఆధ్వర్యంలో రహదారుల మరమ్మతుల పేరుతో రోడ్డులోని గుంతలకు మట్టి వేయడంతో బురదమయంగా మారిపోయింది. ఈ బురదలో వాహనాలు కూరుకు పోతున్నాయి. దీంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు అధికారులకు వినతి పత్రాలు ఇస్తున్న అవి బుట్టదాకలవుతున్నాయి. సమస్యను అధికారులకు ఏకరువు పెట్టినా ఏమాత్రం ప్రయోజనం లేకపోయిందని స్థానికుల నుంచి అసహనం వ్యక్తం అవుతోంది. జోడి చింతల నుండి కనికాపురం వరకు చిత్తూరు-గుడియాత్తం జాతీయ రహదారి 9 కిలోమీటర్లు దూరం ఉంది. ఈ మార్గంలో అడుగడుగునా భారీ గుంతలే దర్శనమిస్తున్నాయి. వాహనదారులు వాటిని తప్పించి ప్రయాణం సాగించడం దుర్లభంగా మారుతుంది. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహన దారులు ప్రమాదాలను బారిన పడుతున్న సంఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. కొంతమంది గాయాలు పాలై మృతి చెందిన సంఘటన కూడా ఉన్నాయి. ఈ రోడ్లలో ప్రతిరోజు ప్రయాణించాలంటే వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించిన దుస్థితి ఏర్పడుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఆదివారం భక్తులకు అన్నదానం చేపట్టారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కుప్పంకి చెందిన దాత మహేంద్రమణి అన్నదానం చేపట్టడం అభినందనీయం అని ఆయన అన్నారు. అదేవిధంగా కార్వేటినగరంలో శ్రీ బంగారమ్మ ఊరేగింపు ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానికులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సుందరంగా అలంకరించారు. ఆ తరువాత నగరంలో ఊరేగించారు. మంగళ, బుధవారాల్లో అమ్మవారి జాతర జరగనుంది.

బోయకొండకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-చౌడేపల్లి: బోయకొండ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ఆలయ అర్చకులు విశేష పూజలు చేసి సుందరంగా అలంకరించారు. భక్తులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు కల్పించారు. తమిళనాడు, కార్నాటన రాష్ట్రం నుంచి భక్తులు వేలాధిగా తరలివచ్చారు. ఆలయ ఛైర్మన్ నాగరాజురెడ్డి, ఈవో చంద్రమౌళి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైసీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ

జాయింట్ సెక్రటరీగా మంజునాథ్



ప్రజాశక్తి-చౌడేపల్లి: వైసీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ జాయింట్ సెక్రటరీగా చౌడేపల్లికి చెందిన గ్రిందెం మంజునాథ్ నియమితులయ్యారు. ఆదివారం తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసంలో ఆయన చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన మంత్రికి, ఎంపీ మిథున్ రెడ్డికి, రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డిలకు కృతఘ్నతలు తెలిపారు.

అలరించిన చిన్నారుల నృత్యం



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని కళాతరంగిని సంస్థ వ్యవస్థాపకులు రాజేష్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం బైరెడ్డిపల్లి చెక్‌పోస్ట్ కుండలిలోని రాయల్ మహల్ నందు వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన విద్యార్థులు డాన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో సినిమా వీడియో సాంగ్స్ పోటీలలో విద్యార్థులచే ప్రదర్శనలు నిర్వహించారు. అందులో భాగంగా ఆదివారం రాత్రి వరకు ప్రదర్శన పిల్లలకు ప్రోగ్రాం జరుగుతుందని, ప్రోగ్రాం పూర్తయిన తర్వాత న్యాయ నిర్ణీతల ద్వారా సెలెక్ట్ అయిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేసే కార్యక్రమం ఉందని రాజేష్ బాబు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మున్సిపాలిటీ 7వ వార్డు బెవనపల్లి గ్రామంలో ఆశా వర్కర్ చైతన్య మృతి చెందడంతో టీడీపీ నాయకులు ఆమె మృతదేహానికి నివాళులు అర్పించారు. ఆర్థిక సాయంగా రూ.10వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవి, మాణిక్యం, వెంకటేష్, కన్నన్, హరి, కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

'పేదలు సంతోషంగా ఉన్నప్పుడే నిజమైన క్రిస్మస్'



ప్రజాశక్తి-వెదురుకుప్పం: నిరుపేదలు సుఖ సంతోషాలతో ఉన్నప్పుడే నిజమైన క్రిస్మస్ అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పోటుగారి భాస్కర్ అన్నారు. ఎస్ఆర్ పురం మండలం తయ్యూరు షికారీ కాలనీలోని చర్చిలో "సెమీ క్రిస్మస్" వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కేట్ కట్ చేసి పేదలకు పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ పేదల కోసం పరితపించినవారే నిజమైన దైవ స్వరూపులు అన్నారు. కార్యక్రమంలో నాయకులు కలికిరి నారాయణస్వామి, పరదేశి, కన్నన్, తులసి, మణి, హుమేష్ తదితరులు పాల్గొన్నారు.

595 మందికి ట్యాబులు మంజూరు : ఎంఈవో

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బైజూస్ కంటెంట్ ట్యాబ్లు మంజూరైనట్లు ఎంఈఓలు నాగేశ్వరావు, రమేష్ బాబు తెలిపారు. మండలంలోని పాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతి చదువుతున్న 296 మంది బాలికలు 299 మంది బాలురు మొత్తం 595 మంది విద్యార్థులకు ట్యాబ్లు మంజూరయ్యాయన్నారు. ఈ నెల 21న విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

పేదలకు దుస్తులు పంపిణీ



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ముందస్తు క్రిస్మస్ వేడుకలు భాగంగా మండలంలోని మాధవ నగర్ బ్లెస్సింగ్ చర్చి నందు ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ యోహాన్, పాస్టర్ కిరణ్, కేక్ కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు. చిన్నపిల్లలు క్రీస్తు వేషధారణలో పలువురిని ఆకట్టుకున్నారు. అనంతరం పేదలకు దుస్తులను వితరణ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ మైకేల్, పాస్టర్ ప్రతాప్, పాస్టర్ మేషాక్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ మండపం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-సోమల: స్వయంభీశ్వరస్వామి ఆలయం వద్ద పేద ప్రజల సౌకర్యార్థం నిర్మిస్తున్న కళ్యాణ మండపం నిర్మాణానికి ధర్మవరం గ్రామం బసంపల్లికి చెందిన బండ్ల కమలమ్మ, బండ్ల చిన్న వెంకటస్వామి జ్ఞాపకార్థం వారి కుమారుడు బి.సోమశేఖర్, పిఎస్ పావని దంపతులు రూ. పదివేల116 విరాళాన్ని ఆలయ ధర్మకర్త బివి.సోమశేఖర్‌కు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు లింగన్న, చంద్రమౌళి, మణి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

'ప్రిన్సిపల్ సెక్రటరీ' పద్ధతి మార్చుకోండి

- ఏపీటీఎఫ్ నాయకుల హితవు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పాఠశాలల పర్యవేక్షణ సందర్భంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించాల్సిన చోట ఉపాధ్యాయులను, ఉన్నతాధికారులను తూలనాడుతూ భయాందోళనకు గురిచేస్తూ విద్యా వినాశకర చర్యలు చేపడుతున్న ప్రవీణ్ ప్రకాష్ తన పద్ధతి మార్చుకోవాలని ఏపీటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్‌కుమార్, ఏ.శ్యాంసుందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చాంద్‌బాషా అన్నారు. సంస్థాగత కార్యక్రమాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ చిత్తూరు జిల్లా శాఖ కౌన్సిల్ సమావేశం స్థానిక జైహింద్ పురపాలక పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రిన్సిపల్ సెక్రటరీ బాధ్యతలు చేపట్టిన నాటినుండి ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రైవేటీకరణం వైపు మళ్ళించే విధంగా పాఠశాలలలో కంటే రాత్రిళ్ళు విద్యార్థుల ఇళ్ళ దగ్గర పర్యవేక్షణలు చేస్తూ ప్రజల్లో ప్రభుత్వ విద్యారంగ గౌరవాన్ని తగ్గిస్తూ మాట్లాడడం ఆక్షేపనీయమని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్ కుమార్ మాట్లాడుతూ 12వ వేతన సవరణ చేపట్టేవరకు తక్షణమే ఐ.ఆర్‌ను ప్రకటించాలని, ఉపాధ్యాయులు కూడా ప్రజల్లో భాగమేనని వారి సంక్షేమం కూడా ప్రభుత్వ బాధ్యతేనని వారందరికీ ఒకటవ తేదీనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల అధికారిగా విచ్చేసిన రాష్ట్ర కార్యదర్శి చాంద్‌బాషా, ఎన్నికల పరిశీలకులుగా విచ్చేసిన రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ రద్దు చేస్తామన్న సిపిఎస్ స్థానాన ప్రతిపాదిత జిపిఎస్ ఉద్యోగులకు ఆమోదయోగ్యం కాదని పాత పెన్షన్ను పునరుద్ధరణ చేసే వరకు ఉద్యమ బాటను వీడబోమని అన్నారు. అనంతరం చిత్తూరు జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా కె. చంద్రశేఖర్ నాయుడు, అధ్యక్షుడిగా కే గోపీనాథ్, ప్రధాన కార్యదర్శిగా జి ముక్తార్ అహ్మద్, ఉపాధ్యక్షులుగా ఎస్ అఫ్జల్ భాష, నవీన్ కుమార్, జగదీష్, దీపాదేవి, కార్యదర్శులుగా డి గురుమూర్తి, లక్ష్మీపతి ,ప్రభాకర్, సుబ్రహ్మణ్యం,వేణు లు, రాష్ట్ర కౌన్సిలర్లుగా జగన్నాథం, శివ శంకర్, జిల్లా ఆడిట్ కన్వీనర్ గా వాసుదేవయ్య మరియు ఆడిట్ కమిటీ సభ్యులుగా శ్రీనివాసులు, చంద్రశేఖర్, మధు, కష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులుగా సౌందర్య, రాజేశ్వరి, మహబూబ్ బాషా, జ్యోతిర్మయి, ఇబ్రహీం, హేమలత, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుబ్రమణ్యం, త్యాగరాజు నాయుడు, అమర్నాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి జిల్లాలోని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం..

- బాస్ ఛైర్మన్ నాగిశెట్టి రవి హామీ

ప్రజాశక్తి-యాదమరి: గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆ సంఘ రాష్ట్ర బాస్ ఛైర్మన్ నాగిశెట్టి రవి హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం వాయిస్ ఆఫ్ రూరల్ డాక్టర్స్ మాసపత్రిక, బోర్డ్ ఆఫ్ యాన్సెస్ట్రాల్ అండ్ ఆల్టర్ నేటివ్ మెడికల్ సైన్సస్ 15వ వార్షికోత్సవం సందర్భంగా చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు భవనంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఆర్ ఎంపి, పీఎంపిల అభివృద్ధి కోసం ఇచ్చిన జీవోను పునరిద్ధరించడానికి రాష్ట్రవ్యాప్త కమిటీతో చర్చలు జరిపి, శిక్షణా తరగతులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. గ్రామీణ వైద్యులైన ఆర్ఎంపి పి.ఎం.పిలు పరిమితికి మించి వైద్యం చేయరాదని నిబంధనలకు లోబడి ప్రాథమిక వైద్యం మాత్రమే అందించి అత్యవసర కేసులు ప్రభుత్వ ఆసుపత్రులకు పంపాలని సూచించారు. గతంలో విడుదల చేసిన 429 జీవో ప్రకారం ఉమ్మడి ఆంధ్రరాష్ట్రాలలో 80 శాతం మంది జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులలో శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకున్నట్లు గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు నాగిశెట్టి రవి తెలిపారు. డాక్టర్ సురేష్, డాక్టర్ లివిజలను సంఘం సభ్యులు దుశ్శాలవాతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామీణ వైద్యులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలకు గాను పలువురు గ్రామీణ వైద్యులకు బాస్ ఛైర్మన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసులు, రవీంద్రబాబు, అంజాద్, రాయుడు, కిషోర్, జవహర్, భాస్కర్, గోవిందా రాజులు, బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



'తెలకోవెల' పుస్తకావిష్కరణ



ప్రజాశక్తి- గంగవరం: ప్రముఖ రచయిత బొన్నవిత్తుల శ్రీరామ చంద్రమూర్తి రచించిన 'తెలకోవెల' కథా సంపుటి పుస్తకాన్ని ఆదివారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కళామందిరంలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ కవి కె.ఎస్వీ మాట్లాడుతూ మానవత్వం కలిగి ఉండి మనిషిని చైతన్య పరిచేవిధంగా రచనలు చేయగలిగిన వాడే నిజమైన రచయిత అన్నారు. శతావధాని ఆముదాల మురళి మంట్లాడుతూ సామాజిక స్పృహ కలిగిన రచనలే నిలబడగలుగు తీయన్నారు. రచయిత కోసం చదవడం మొదలెట్టి తనకోసం పుస్తకాన్ని పూర్తిగా చదివేలా పుస్తకాలు ఉండాలన్నారు. రచయిత్రి అరుణకుమూరి మాట్లాడుతూ గ్రామీణ జీవన పరిస్థితులను తనకథలలో రచించిన జొన్నవిత్తుల అన్నారు. కవితా టియస్ ఎ.కృష్ణమూర్తిలు పుస్తకాన్ని పరిచయం చేశారు. ఈ సందర్భంగా రచయిత దంపతులకు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు పి-తులసినాథం, పుష్ప, మాధవరెడ్డి. సిద్ధార్థలు ఘనంగా సత్కరించారు. మొహిద్దీన్, చంద్రశేఖరయ్య, పలమనేరు బాలాజీ, కవిత, జ్యోతి, గోపీనాథ్. గిరిధరముండి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

- అధికారులకు మంత్రి ఆదేశం



ప్రజాశక్తి-నగరి: రెండు దశాబ్దాలుగా మున్సిపల్ పరిధి ఇందిరాగనర్ పల్లం అనే ప్రాంతంలో నివశించేవారు. ఎదుర్కొన్న డ్రైనేజీ, సిమెంటు రోడ్డు సమస్యకు పరిష్కారం లభించింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ ప్రాంతంలో అధికంగా నివశించే మైనారిటీ మహిళలు మంత్రి దృష్టికి తమ సమస్యను తీసుకువచ్చారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ రోడ్డు కావాలంటూ ఏళ్లతరబడి పోరాడుతున్నామన్నారు. ఆదివారం ఈ ప్రాంతంలో భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. మంత్రికి స్థానిక మైనారిటీలు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మండలంలోని అర్జునప్పనాయుడు కండ్రిగ, చెర్లోకండ్రిగ, టివి కండ్రిగ గ్రామాల ముప్పై యేళ్ల తాగునీటి సమస్య మంత్రి పరిష్కరించారు. నీటి కులాయిలు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు భారతి, రమేష్, బీడీ భాస్కర్, భూపాలన్, మోహన్‌రాజ్, ఇంద్రయ్య, కోఆప్షన్ సభ్యులు హమీద్, ఆనంద్‌కుమార్, ఎల్లప్పరెడ్డి, నాయకులు ఏఆర్ జైలాబ్దీన్, సంసుబాయ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకి నివాళి



చిత్తూరు నగరంలో గాండ్ల సంక్షేమ సంఘం భారీ ర్యాలీ

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్: నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో అఖిల గాండ్ల తెలకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ గోపీనాథ్ తనయుడు భూపేష్ గోపీనాథ్ ఆధ్వర్యంలో అట్టహాసంగా ఆదివారం కార్తీక నెల వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా నాగయ్య కళాక్షేత్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భూపేష్ గోపీనాథ్ మాట్లాడుతూ గాండ్ల సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు. గాండ్ల కులస్తులందరూ ఏకతాటిపై నిలవాలని, మన సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గాండ్ల కులస్తులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బిఎంఆర్ సంస్థల అధినేత



ప్రజాశక్తి-యాదమరి: బిఎంఆర్ సంస్థల అధినేత మోహన్‌రెడ్డి ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలో కలిశారు. రానున్న ఎన్నికలు నేపథ్యంలో పూతలపట్టు నియోజకవర్గంలో మూడవసారి వైసీపీని గెలిపించు కునే బాధ్యత బిఎంఆర్ సంస్థలు అధినేత మోహన్ రెడ్డికి అప్పగించినట్లు విశ్వసినీయ సమాచారం. మోహన్‌రెడ్డి తమ్ముడు జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ ఈసారి పలమనేరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి పార్టీ అభ్యర్థిగా జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ బి.ధనుంజయరెడ్డి అభ్యర్థిత్వం ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై ఇంకా స్పష్టత రాలేదు.

గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

ప్రజాశక్తి-యాదమరి: భారత్ గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలని శ్రీ శివ సాయిజ్యోతి గ్రామీణ వితరక్ ఏజెన్సీ నిర్వాహకులు వరదరాజులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండలంలో భారత్ గ్యాస్ వినియోగదారులు తమ ఆధార్ కార్డు వివరాలతో కార్యాలయ పని వేళలో సంప్రదించి, బయోమెట్రిక్ విధానం ద్వారా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

తోపుడు బండ్లు పంపిణీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిజెఎం ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురికి తోపుడు బండ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీ, కొంగారెడ్డిపల్లిలో చిత్తూరు నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త, మాజీ ఎంఎల్‌సీ దొరబాబు, జీజెఎం ఛారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవనాయుడు చిరువ్యాపారులకు ఈ తోపుడు బండ్లు పంపిణీ చేశారు. సుమారు రూ.4లక్షలతో 10తోపుడు బండ్లు, 10టిఫిన్ బండ్లు అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజశేఖర్, సియంటి త్యాగరాజు, సి.యం విజయ, హేమాద్రి నాయుడు, శశికర్ బాబు, మోహన్ రాజ్, సురేష్ పాల్గొన్నారు.



ఫోటో: 1. తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్న జీజేఎం పౌండేషన్ నిర్వాహకులు గురజాలచెన్నకేశవనాయుడు.

రైల్వే స్టేషన్ కమిటీ సభ్యుడిగా రవి

ప్రజాశక్తి- యాదమరి: పూతలపట్టు రైల్వే స్టేషన్ కమిటీ సభ్యుడుగా యాదమరి మండలం కొట్టాల గ్రామానికి చెందిన బిజెపి మండల అధ్యక్షుడు సి.రవి సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజనల్ అదనపు కమర్షియల్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారు. రైల్వే స్టేషన్ కమిటీ సభ్యుడుగా సంవత్సరం పాటు ఎస్సిసి స్టేషన్ కన్సోలేటివ్ కమిటీ మెంబరుగా కొనసాగుతారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తనకు కమిటీ మెంబర్ సభ్యునిగా రావడానికి సహకరించిన మండల జిల్లా రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పూతలపట్టు రైల్వే స్టేషన్ అభివృద్ధికి ప్రయాణికుల సౌకర్యాలు కల్పనకు సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని వెజ్జుపల్లె పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నాయకలు ఆదివారం టీడీపీలో చేరారు. బందార్లపల్లెలో 10మంది, ఆదిఆంధ్రవాడకు చెందిన 25కుటుంబాలు టిడిపి ఇన్‌ఛార్జ్ డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా థామస్ వారికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు చిట్టిబాబునాయుడు, స్వామిదాస్, శ్రీధర్‌యాదవ్, వెంకటేష్, దేవ సుందరం, గుండయ్య, జ్యోతియాదవ్, కోదండరెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పట్టాలిచ్చారు.. సాగు భూమి చూపలేదు..

- స్పందించని ఓజిలి తహశీల్దారుపై చర్యలు తీసుకోవాలి - సిపిఎం జిల్లా కార్యదర్శి నాగరాజు



ప్రజాశక్తి- నాయుడుపేట: ఓజిలి మండలం భువనగిరి పాలెం వాసులకు పట్టాలిచ్చారు..సాగుభూమి చూపించలేదని, స్పందించని తహశీల్దారుపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పేర్కొన్నారు. భూ సమస్యపై నాయుడుపేటలో వెదనపర్తి సుందర్ రామిరెడ్డి భవనంలోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న వందవాసి నాగరాజు మాట్లాడుతూ 2019 లో ఎస్సీ ఎస్టీ బీసీలకు 15 మందికి డి ఫారం పట్టాలిచ్చినా నేటికీ వారికి సాగు భూములు చూపించకపోవడం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శమని అన్నారు. అంతే కాకుండా 17 మంది కి గ్రామంలో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు అదే గ్రామంలో రెవెన్యూ లో పనిచేస్తున్న ఒక ఉద్యోగి అదే సామాజిక వర్గానికి చెందిన వారికి బినామీ పేర్లతో పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. స్పందనకు అర్జీ పెడితే పరిష్కరించామని ఎండార్స్మెంట్ పంపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు ప్రజల సమస్యలు పరిష్కరించకుండా భూస్వాములకు భూములు పంచేందుకు అధికారు లుగా ఉన్నారే తప్ప పేదల పక్షాన లేరని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓజిలి మండలంలో ప్రతి గ్రామంలో భూ సమస్యలు అధికం గా ఉన్నాయని ఆయన తెలిపారు. ఇదే గ్రామంలో వాగు పోరం బోకు భూములు వందల ఎకరాలు భూ స్వాముల చేతిలో ఉన్న రెవెన్యూ అధికారులు నిద్రా వస్థలో ఉండడం తగదన్నారు. సిపిఎం నేతలు చాపల వెంకటేశ్వర్లు , శివకవి ముకుందా మాట్లాడుతూ డివిజన్లో రెవెన్యూ అధికారులు దళారుల ద్వారా ప్రతి పనికి ఒక రేటు గట్టి మామూళ్ల మత్తులో జోగుతున్నారని తెలిపారు రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం విడనాడకపోతే తహశీల్దారు కార్యా లయం వద్ద పెద్ద ఎత్తున పోరాటాలకు సిపిఎం సిద్ధమ వుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నేత చంద్రకళ సిఐటియు, నాయకురాలు శ్యామలమ్మ గ్రామస్తులు సుబ్బయ్య సురేష్ భవాని రవి గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ ట్రాలీ చోరీ

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని ఆళ్లమడుగు పంచాయతీ బుచ్చిరెడ్డి కండ్రిగ గ్రామంలో ట్రాక్టర్ ట్రాలీ చోరీ గురైంది. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాలీని అపహరించారని బాధితుడు సుధాకర్‌రెడ్డి మీడియాకు వివరించారు. ఈ విషయంపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

హత్య కేసు ఛేదించిన పోలీసులు



ప్రజాశక్తి-గంగవరం: గంగవరం పంచాయతీ సాయినగర్‌లో ముదురోజుల ముందు మహిళ దారుణ హత్యకు సంబంధించిన కేసును పోలీసులు ఛేదించారు. ఆదివారం మీడియా ముందు నిందితుడిని చూపించారు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి వివరాలను వెల్లడిస్తూ.. మూడు రోజుల ముందు సాయినగర్‌లో జరిగిన మహిళ హత్య కేసుపై దర్యాప్తు చేశామన్నారు. మృతిరాలు లక్ష్మీ కొంతకాలంగా పలమనేరు పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించి, వాటిని అమ్ముకొని జీవనం సాగించేదన్నారు. పలమనేరు మండలం కాల్వపల్లి పంచాయతీ బైయప్పగారిపల్లెకు చెందిన మంజునాథ్ తాపీ పనులు చేసుకుంటున్నాడు. కొంతకాలంగా లక్ష్మీని లొంగతీసుకొనే ప్రయత్నం చేసి మూడు రోజుల ముందు పని ఇప్పిస్తానని సాయినగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం వద్దకు తీసుకెళ్లినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. అంతకు ముందే మద్యం తీసుకొని అక్కడకు వెళ్లి అమెపై అత్యాచారం చేసి విషయం బయటకు చెబుతుందేమోనని పక్కనే ఉన్న కర్రతో దాడి చేసినట్లు విచారణలో తేలిందన్నారు. దీంతో లక్ష్మీ స్పృహ కోల్పోగా గుట్టుచప్పుడు కాకుండా అతను ఉడాయించాడని వివరించారు. ఆదివారం దండపల్లి క్రాస్ వద్ద మంజునాథ్‌ని అదుపులోకి తీసుకొని విచారించగా విషయం ఒప్పుకొన్నట్లు తెలిపారు. దీంతో అతన్ని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మొగిలి గ్రామం శివాలయం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. గుర్తు తెలియని వృద్ధుడు ఆలయం ఆవరణంలో మృ తి చెంది ఉండాని గమనించి ఆలయ సిబ్బ ంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పరిశీలించి శవ పరీక్ష నిమిత్తం బంగారుపాలెం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు పోలీసులు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి-నగరి: పట్టణ పరిధి బైపాస్ కూడలి వద్ద గల ఓంశక్తి ఆలయంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఎస్ఐ రాజా కుల్లయప్ప, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రామచంద్రన్, డాక్టర్ అంబ్రోస్ విల్సన్ ముఖ్యఅతిధులుగా పాల్గొని క్యాలెండర్లను ఆవిష్కరించారు. శక్తి మాల ధరించి ఇరుముడి యాత్రలో పాల్గొను భక్తులందరికీ క్యాలెండర్లు ఉచితంగా అందిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

తప్పతాగి వాహపం నడిపితే జైలుకే : ఎస్ఐ



ప్రజాశక్తి-సోమల: వాహన చోదకులు తప్పతాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు చేపట్టి జైలుకు పంపుతామని ఎస్ఐ వెంకటనరసింహులు హెచ్చరించారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో వాహన తనిఖీలు చేపట్టారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు.

విద్యుత్ రాయితీకి దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-సోమల: మండలంలోని వ్యవసాయ విద్యుత్ బోరు మోటారు సర్వీసు, బావి మోటార్ విద్యుత్ సర్వీస్ కలిగిన రైతులు ప్రభుత్వం అందించే విద్యుత్ సబ్సిడీ కోసం తమ బ్యాంకు అకౌంట్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ బుక్ జిరాక్స్ ను విద్యుత్ శాఖ సిబ్బందికి అందజేసి దరఖాస్తులు పూర్తి చేసుకోవాలని ఏఈ మహేందర్ రెడ్డి కోరారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మండలంలో 6000 పైచిలుకు విద్యుత్ వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయని వీటిలో అధిక శాతం మంది రైతులు జిరాక్స్ కాపీలు అందించినట్లు తెలిపారు.